నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

- అగ్ని ప్రమాదాల నివారణకు పలు చోట్ల అవగాహన సదస్సులు
- ఈ నెల 20 వరకు కొనసాగింపు
- అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు

బాపట్లటౌన్: వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విధిగా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని బాపట్ల అగ్నిమాపకశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. 15న బాపట్ల పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో 'ఫైర్ డ్రిల్స్' నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. 16న పట్టణంలోని గాయత్రీ అపార్ట్‌మెంట్స్, పూరి గుడిసెలు ఎక్కువగా ఉండే డ్రైవర్స్ కాలనీ, కామ్రేడ్ సుందరయ్య కాలనీ, ఎంఆర్‌కే నగర్‌లలో వంట గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

17న జేమ్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. 18న ఇండస్ట్రియల్ ఏరియా, కోన ఫిల్లింగ్ స్టేషన్, హెచ్‌పీ గ్యాస్, ఇండెన్ గ్యాస్ గోడౌన్‌లలో తనిఖీలు నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనా సదస్సు నిర్వహిస్తామన్నారు. 19న ప్రభుత్వ ఏరియా వైద్యశాల, శ్రీ వెంకటేశ్వర పాలీక్లినిక్‌లో కెమికల్ వాడకాలు, ఎక్స్‌రే, ఎలక్ట్రానిక్ పరికరాల వాడుకలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తామన్నారు. 20న బాపట్ల అగ్నిమాపక కేంద్రంలో ముగింపు సమావేశం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంల తరలింపు



రేపల్లె రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీ అభ్యర్థుల భవిష్యత్‌ను నిర్ణయించే ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరాయి. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెలా షారోన్ పర్యవేక్షణలో పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు శనివారం ఈవీఎంలను తరలించారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎం మిషన్‌లను ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రులు



భట్టిప్రోలు: శుక్రవారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో భట్టిప్రోలులో 9 రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీరామ, లలితా సహస్ర నామ పారాయణం 5వ రోజు శనివారం గ్రామానికి చెందిన పాలకుర్తి మురళీకృష్ణుడు స్వగృహంలో జరిగింది. చైత్ర మాసంలో వసంత నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవిని 9 రూపాల్లో అలంకరించి పూజలు చేయడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం శ్రీరామనవమితో ఈ కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో వేసవి దృష్ట్యా చిరు వ్యాపారులకు నీడనందించే గొడుగులు పంపిణీ చేశారు. శనివారం భట్టిప్రోలులో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకుంటున్న ముగ్గురికి ఈ గొడుగులు అందజేశారు. గత నెల 24న మొదటి విడతగా 12 గొడుగులను అందించామని శనివారం రెండో విడతగా మరో మూడు గొడుగులను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న భట్టిప్రోలుకు చెందిన ఉద్యోగులు, వ్యాపారవేత్తలు అసోసియేషన్‌గా ఏర్పడి గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు(బీఎస్సార్), వంగర బాబూజీ, పసుపులేటి శివ రామ ప్రసాద్, మద్దుల వెంకట రాజారామ్, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఫలితాల్లో వేజండ్ల విద్యార్థిని ప్రతిభ



గేరా అక్షర

చేబ్రోలు: ఏఎన్ఎమ్ నర్సింగ్ పరీక్షా ఫలితాల్లో చేబ్రోలు మండలం వేజండ్ల సెయింట్ జోసఫ్స్ నర్సింగ్ స్కూలు విద్యార్థిని గేరా అక్షర 92 శాతం మార్కులతో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎస్ మమత శనివారం తెలిపారు. రెండు రోజుల క్రితం విడుదలైన నర్సింగ్ పరీక్షా ఫలితాల్లో వేజండ్ల గ్రామంలోని సెయింట్ జోసఫ్స్ ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ స్కూల్‌లో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గేరా అక్షర 600 మార్కులకు గానూ 551 మార్కులతో రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ నర్సింగ్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిలో ఐదుగురు 500 పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్ మమత, జయశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదకాకాని: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని మౌర్యబార్ రెస్టారెంట్ వద్ద చోటు చేసుకుంది. గత మూడు రోజులుగా మద్యం సేవిస్తూ హిందీలో మాట్లాడుతున్న వ్యక్తి ఆ ప్రాంతంలో కనిపించారు. శుక్రవారం సాయంత్రం అపస్మారక స్థితిలోకి చేరుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వీఆర్వో షేక్ రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ కె వీరాస్వామి తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రఘుపతి, మాజీ ఎమ్మెల్యే గోవర్ధనరెడ్డి
- తిరునాళ్లకు పోటెత్తిన భక్తజనం



గ్రామోత్సవానికి తరలి వచ్చిన బ్రహ్మంగారి మొక్కుబడి జెండాలు

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధనా తిరునాళ్ళ మహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్లలో స్వామివారి ఆలయ జెండాతో పాటు గ్రామంలో భక్తుల మొక్కుబడుల జెండాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి జెండాలకు మహిళలు హారతులిచ్చి పూజలు చేసి టెంకాయలు సమర్పించారు. గ్రామోత్సవంలో స్వామివారి జెండాలను పాతనందాయపాలెం డొంక మీదుగా కర్లపాలెం ఐలాండ్ సెంటర్ వరకు అక్కడి నుంచి తిరిగి ఊరేగింపుగా స్వామివారి గుడి వద్దకు తీసుకువచ్చి రావిచెట్టుకు ప్రతిష్టించారు. తిరునాళ్లలో భాగంగా ఆలయానికి రంగు రంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు. ఆలయం వద్ద విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తిరునాళ్లకు వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించి పూజలు చేసి రావి చెట్టు వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మురళీ కోలాటం భజన , బ్రహ్మంగారి చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. తిరునాళ్లలో ఎలాంటి అల్లర్లు జరగకుండా స్థానిక ఎస్ఐ ఎం.జనార్దన్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నేడు కోన రఘుపతి ఎన్నికల ప్రచారం

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ అభ్యర్థి కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం సాయంత్రం 4 గంటలకు భవనంవారిపాలెం, చోడిపాలెం, కోమలి, సంగుపాలెం, కోడూరు, చందోలు గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

హాజరుకానున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం రాధాకృష్ణమూర్తి, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావులు పాల్గొనే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడిగా మాకినేని



కాకుమాను: పెదనందిపాడు మండలంలోని అబ్బినేనిగుంట పాలెం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా మాకినేని సదాశివరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. గతంలో ఆయన టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషించి గత నాలుగు రోజుల క్రితం పార్టీ మండల కన్వీనర్ ఖాసీంపీరా ఆధ్వర్యంలో తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం రాత్రి సదాశివరావును గ్రామ పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు సదాశివరావును అభినందించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బేతాళ ప్రభాకర్

తెనాలి రూరల్ : తెనాలి బార్ అసోసియేషన్ ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా అన్నం పిన్నారావు, కార్యదర్శిగా హరిదాసు గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శిగా ఎ. కిషోర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు శనివారం అభినందించి సత్కరించారు.

జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమాలకు పెద్దపీట



19వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మోపిదేవి రాజీవ్, ఈవూరు సృజన్

రేపల్లె రూరల్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి రాజీవ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి ఈవూరు గణేష్ తనయుడు డాక్టర్ ఈవూరు సృజన్‌లు అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 19వ వార్డులో శనివారం నిర్వహించిన ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. విద్య, వైద్యంకు పెద్దపీట వేస్తూ వేలాది కోట్ల నిధులు వ్యయం చేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యంను పేదలకు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి ఆంగ్ల మాధ్యమ బోధన అందాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చటంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధనలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నందిగం సురేష్‌కు, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయనున్న డాక్టర్ ఈవూరు గణేష్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కోటయ్య



కోటయ్యకు నియామకపు పత్రం అందచేస్తున్న శ్రావణ్‌కుమార్

భట్టిప్రోలు: జై భీమ్‌రావ్ భారత్ పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థిగా పల్రే కోటయ్యను ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ న్యాయమూర్తి జడా శ్రావణ్‌కుమార్ శనివారం ఖరారు చేశారు. ఈ మేరకు నియామకపు పత్రాన్ని కోటయ్యకు అందచేశారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి బాపట్ల పార్లమెంట్ స్థానం కేటాయించిన శ్రావణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిశీలకుడు పరసా సురేష్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్ రామ్‌జీ పాల్గొన్నారు.

ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలి

రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ రమణ



ర్యాలీలో పాల్గొన్న రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ రమణ, కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్ : ఓటు ఆవశ్యకతను అందరూ తెలుసుకుని వచ్చే ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెనాలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ రమణ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్విప్ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో శనివారం ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులోకి వెళ్ళి ప్రయాణికులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మే 13న జరిగే ఎన్నికల్లో అందరూ ఓట్లు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్, సచివాలయ, రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనపర్తి ఏసురత్నం ఉద్యమజీవితంపై పుస్తకావిష్కరణ

తెనాలి : అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటిహాలులో ఆదివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సభను నిర్వహించనున్నారు. అంబేడ్కర్ సేవా ట్రస్ట్, జైభీమ్ ఫెడరేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సభలో ప్రముఖ అంబేడ్కర్‌వాది, నిబద్ధత కలిగిన దళిత ఉద్యమ రథసారథి కనపర్తి ఏసురత్నం ఉద్యమ జీవితంపై రూపొందించిన పుస్తక పరిచయం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సేవా ట్రస్ట్ కార్యాలయంలో శనివారం సాయంత్రం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఏసురత్నంపై పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి సంకలనంలో తీసుకువచ్చారని, ఆమె దీనిని ఆవిష్కరిస్తారని డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ వెల్లడించారు. అదే సభలో ప్రముఖ దళిత నేతలు ప్రసంగిస్తారని వివరించారు. కరపత్రం ఆవిష్కరణలో డాక్టర్ అబ్రహాం లింకన్, పిల్లి విద్యాసాగర్, దుభా సందీప్, పాముల దాస్, కనపర్తి మోహన్‌రావు, మోపర్తి సుధాకర్, యంద్రపాటి అశోక్ పాల్గొన్నారు.

బీపీ మండల్ ఆశయ సాధనకు కృషి



బీపీ మండల్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: రిజర్వేషన్ల సాధకుడు, బీసీల ఆశాజ్యోతి, మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్ పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల వారికి న్యాయం జరగాలంటే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని భావించి దేశమంతా తిరిగి బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసిన మహనీయుడు బీపీ మండల్ అని తెలిపారు. ఆయన అధ్యయనం చేసి అప్పటి ప్రధానికి నివేదిక ఇచ్చారన్నారు. నాడు ఆయన పోరాట ఫలితం నేడు మనం అనుభవిస్తున్న రిజర్వేషన్లని తెలిపారు. బీపీ మండల్ విగ్రహ కమిటీ కో కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనాడు బీపీ మండల్ 40 అంశాలను ప్రతిపాదిస్తే వాటిలో కేవలం రెండు అంశాలు మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో మాత్రమే సిఫార్సులు అమలు చేస్తున్నారన్నారు. మిగిలిన సిఫార్సులను ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బి రామచంద్ర యాదవ్, దాసరి శివకుమార్, వాసు, పేరయ్య, జూపూడి శ్రీనివాసరావు, బత్తుల వీరాస్వామి, ఎస్ రామారావు, ఎస్ రాంబాబు, టి నరసింహారావు, ఏ రామకృష్ణ, మహాలక్ష్మి తదితరులున్నారు.

క్రీస్తుని నామంతో ప్రశాంత జీవనం

కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్



ప్రార్థనలో పాల్గొన్న మంత్రి విడదల రజిని, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు రూరల్: క్రీస్తుని నామంలో విజయం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. గత మూడు రోజులుగా నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సువార్త ఉజ్జీవ మహాసభలు శనివారం కొనసాగాయి. ఉదయం ప్రత్యేక ప్రార్థనల్లో ముందుగా కృపా మినిస్ట్రీస్ బ్రాంచ్‌లకు చెందిన పాస్టర్లు క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ స్తుతి గీతాలు ఆలపించారు. బ్రదర్ మాథ్యూస్ క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందిస్తూ ఏసు క్రీస్తు లోకంలోని పాపుల పాపాలను కడిగేందుకు జన్మించాడన్నారు. ఆయన రక్తంతో పాపుల పాపాలను కడగల పవిత్రమైన దేవుడు క్రీస్తని తెలిపారు. క్రీస్తుని నమ్మి ఆయన సన్మార్గంలో నడిస్తే ఎటువంటి ఆటంకాలు లేకుండా జీవితం ప్రశాంతంగా సాగుతుందన్నారు. పాస్టర్ బోగి శాంతారావు, వినయ్ మాథ్యూస్‌లు క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో 18వ వార్షిక ప్రత్యేక ప్రార్థనల నూతన స్తుతిగీతాలు ఆలపించారు. ఉదయం, సాయంత్రం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో లక్షలాదిగా క్రీస్తుని భక్తులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రత్యేక ప్రార్థనలు ముగుస్తాయని మినిస్ట్రీస్ ప్రతినిధులు తెలిపారు.

పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులు

నెహ్రూనగర్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించబడిన పోలింగ్ ఆఫీసర్(పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ల(ఏపీఓ)కు ఈ నెల 15,16 తేదీల్లో తొలివిడత ట్రైనింగ్‌ను ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పీఓలు, ఏపీఓలకు సోమ, మంగళవారాల్లో ఏసీ కాలేజీలోని మొదటి అంతస్తు లైబ్రరీ బిల్డింగ్ 4 రూముల్లో రూముకు 62 మంది చొప్పున పీఓ, ఏపీఓలకు చొప్పున ప్రత్యేక మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే వారికోసం రూముల వారీగా ప్రత్యేక టేబుల్స్. సిబ్బందిని కేటాయిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అధికారులు తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. పీఓలకు శిక్షణ సమయంలో పీఓ డైరీ ఇతర మెటీరియల్ శిక్షణ కేంద్రం వద్ద అందజేయడం జరుగుతుందన్నారు. శిక్షణ కేంద్రం వద్ద ఇంజినీరింగ్ అధికారులు విద్యుత్, శిక్షణకు ఎల్.ఈ.డీ టీవీలు, తాగు నీరు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం వారు ఏసీ కాలేజీ ప్రధాన గేటు దగ్గర సమాచార బ్యానర్లను, గేటు నుంచి రూముల వరకు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. శానిటరీ విభాగం వారు రూములు, టాయిలెట్‌లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మేడికొండూరు: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని మందపాడు ఎస్సీ కాలనీకి చెందిన కఠారు మరియదాసు(42) పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడు సంవత్సరాలుగా సాగు చేస్తున్న మిర్చి పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, పెట్టుబడి పెరిగి, ఆదాయం తగ్గడంతో అప్పుల పాలయ్యాడు. తన జీవనోపాధి వ్యవసాయం కావడంతో లాభాలు వస్తాయని ఆశయతో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. ముందస్తుగా కౌలు కొంత మొత్తం చెల్లించాడు. సాగు వర్షాభావం పరిస్థితుల్లో పంట దిగుబడి ఆశించినదాని కంటే తగ్గింది. పంట సాగుకు తెచ్చిన అప్పు, మరో పక్క పురుగు మందుకు తెచ్చిన అప్పులు మొత్తం రూ.5 లక్షలు అప్పులు తేలింది. అప్పుల భారం భరించలేక గ్రామంలో మిర్చి కల్లంలో క్రిమిసంహారక మందు తాగి పడి ఉన్నాడు.

స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాన్ని కదిలించేది కవిత్వమే

గుంటూరు రూరల్: సమాజాన్ని కందిలించేది కవిత్వమేనని 'నేటి నిజం' సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. శనివారం మండలంలోని పొత్తూరు నందున్న సాహితీకిరణం బ్రాంచి కార్యాలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కవిత్వం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మాతృభూమి, మాతృభాషను ఎన్నటికీ మరిచిపోరాదన్నారు. కేవీఎల్ఎస్ ప్రసన్నకుమారి రచించిన 'సాహితీ సంకలనం', 'ఆలోచనల ఆవిష్కరణ' అనే పుస్తకాలను పొత్తూరి సుబ్బారావుతో కలిసి ఆవిష్కరించారు. తన కుమార్తె పేరిట తాను కథల పోటీలు నిర్వహిస్తూ సాహితి సేవ చేస్తున్నానని విడదల సాంబశివరావు పేర్కొన్నారు. వడలి రామకృష్ణ సాహిత్యానికి ఉన్న విలువలను తెలిపారు. తంగిరాల చక్రవర్తి బహుమతులు పొందిన కథలను వెల్లడించారు. పొత్తూరు జయలక్ష్మి ఆవిష్కరించిన రెండు పుస్తకాలను సమీక్షించారు. సాహితీ సంకలనం పుస్తకాన్ని కెవిఎస్ఎస్‌వి ప్రసాద్ అంకితంగా స్వీకరించారు. శ్రీ కార్తీక డెవలపర్స్ సౌజన్యంతో నిర్వహించిన ఉగాది కవితల పోటీలలో విజేతలైన పరిమి వెంకటసత్యమూర్తి, పొత్తూరు సీతారామారాజు, కె కాశింబి, కోనేటి నరేష్, నిహారిక ఫౌండేషన్ సంక్రాంతి కథల పోటీ విజేతలు ఉయ్యూరు అనసూయ, సీహెచ్‌సీ శర్మ, సూరిశెట్టి వసంతకుమార్, మట్టూరి కమలమ్మ ఫౌండేషన్ చిన్న కథల పోటీల విజేతలు కృపాకర్, పాణిగ్రాహి రాజశేఖర్, కట్టా రాంబాబులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ జానీబాషా, పోచిరాజు పావనిశ్రీ పాల్గొన్నారు.

ప్రారంభమైన హ్యాక్‌ఫెస్ట్ రీజినల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న టీంలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఫెస్టులు ఎంతో ఉపయోగపడతాయని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో 'హ్యాక్‌ఫెస్ట్ 2024' రీజినల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు రియల్ వరల్డ్ సమస్యలకు ఇన్నోవేటివ్ ఐడియాలను గుర్తించి వాటిని ప్రదర్శించటానికి ఇలాంటి జాతీయ స్థాయి ఫెస్ట్‌లను శాప్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. ఎల్ వెంకటరామన్ మాట్లాడుతూ సాంకేతిక విద్యా మండలి ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధిగమించటానికి సాంకేతికత మరింత అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన విధంగా తమ కళాశాలలో విద్యాబోధన, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే సౌకర్యాలను కల్పించటం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 కళాశాలలకు చెందిన 75 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ బాలాజీ, డాక్టర్ కె రామారావు, డాక్టర్ వై రాకేష్‌కుమార్ విద్యార్థులు తదితరులున్నారు.

రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

తెనాలి రూరల్ : ఓ స్థలం విషయమై రెండు సామాజిక వర్గాలు ఘర్షణ పడగా, ఇద్దరు గాయాలపాలయ్యారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో స్థల వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ స్థలంలో కంచె వేసేందుకు ఓ వర్గం శుక్రవారం ప్రయత్నించగా మరో వర్గం అడ్డుకుంది. ఈ నేపథ్యంలో జరిగిన దాడిలో ఇద్దరు ముస్లిం వ్యక్తులు గాయాల పాలయ్యారు. వీరు వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

ఈదర వంశస్థుల ఆత్మీయ సమ్మేళనం

తెనాలి అర్బన్ : ఈదర వంశస్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఐతానగర్‌లో శనివారం నిర్వహించారు. ఒంగోలు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ ఈదర హరిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని వంశవృక్షానికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. అనంతరం హరిబాబు, రచయిత ప్రభాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఈదర శ్యామ్, ఈదర వెంకటపూర్ణచంద్, ఈదర అంకినీడు, ప్రభాకరరావు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, బుచ్చయ్య, పిచ్చయ్య, వేణు, రాంబాబు, రత్నాకర్ పాల్గొన్నారు.